క్లుప్తంగా

ప్రణాళికలు తయారు చేయాలి



శిక్షణ ఇస్తున్న ఏపీఎం శ్రీనివాసబాబా

సారవకోట: స్వయం శక్తి సంఘాల సభ్యులందరూ రుణ, జీవనోపాధుల ప్రణాళికలు తయారు చేయాలని సెర్ప్ ఏపీఎం శ్రీనివాసబాబా సూచించారు. స్థానిక సెర్ప్ సమావేశ మందిరంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబా మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో సంఘాల్లో ఉన్న సభ్యులకు కావాల్సిన రుణాలు, జీవనోపాధులను పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సర్వే చేయాలన్నారు. ఈ సర్వేను ఏప్రిల్ 7వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సీసీలు తవిటినాయుడు, శాంతి, ఉష, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట ఖరారు



వేలం పాటలో పాల్గొన్న అధికారులు, పాటదారులు

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు చింతాడ గ్రామంలో ప్రతీ శనివారం నిర్వహించే వారపు సంతలో ఆశీలు వసూలు కోసం గురువారం నిర్వహించిన వేలంపాట ఖరారైంది. మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ లక్ష్మీనారాయణ బిశాయి ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంపాట నిర్వహించారు. వేలం పాటలో చింతాడ గ్రామానికి చెందిన బోర హరనాథ్, బోర భారతి పాల్గొన్నారు. సర్కారు వారి పాట రూ.7.24 లక్షలతో ప్రారంభం కాగా.. బోర భారతి రూ.7.62 లక్షలకు పాటను కైవసం చేసుకున్నారు. దీనికి అదనంగా రూ.లక్ష స్వీపర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు తెలిపారు. మున్సిపల్ రెవెన్యూ విభాగ సీనియర్ అసిస్టెంట్ జామి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ



విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ మూర్తి

నరసన్నపేట: స్థానిక చిత్తిరి వీధికి చెందిన దుంగ రుతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి డీఎస్పీ మూర్తి గురువారం విచారణ చేపట్టారు. తనతోపాటు తన కుటుంబ సభ్యులకు కులం పేరుతో దూషిస్తూ, తనపై బండి అనిల్ అనే వ్యక్తి దౌర్జన్యం చేశాడని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు రుతమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులను డీఎస్పీ విచారించి వివరాలను నమోదు చేసుకున్నారు. మరోసారి వచ్చి దర్యాప్తు చేస్తామని డీఎస్పీ తెలిపారు. నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ ఉన్నారు. ఈ సందర్భంగా రుతమ్మతోపాటు కుటుంబ సభ్యులు విలేకర్లతో మాట్లాడారు. అనిల్ అనే వ్యక్తి చాలా ఇబ్బంది పెట్టాడని, మహిళలని కూడా చూడకుండా దౌర్జన్యం చేశాడన్నారు. ఇప్పటికీ బెదిరిస్తున్నాడని, ఇక్కడ ఉండాలంటే భయమేస్తోందన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా 'అన్నెపు'



అన్నెపు సత్యనారాయణ

ఆమదాలవలస: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అన్నెపు సత్యనారాయణ ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా సాధు ధనుంజయరావు వ్యవహరించారు. 67 మంది న్యాయవాదులకు 58 మంది ఓట్లు వేశారు. అధ్యక్ష పదవికి అన్నెపు సత్యనారాయణ, పి.వి.నరసింహులు పోటీ పడ్డారు. సత్యనారాయణ 6 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా బి.లక్ష్మణరావు, కార్యదర్శిగా బి.గోవిందరావు, జాయింట్ సెక్రెటరీగా కె.గణపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధనుంజయరావు తెలిపారు. సత్యనారాయణకు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీభాయ్, పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



డిజిటల్ ఎక్స్‌రేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సూపరింటెండెంట్ ఎస్.కృష్ణారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సీహెచ్‌సీలో రూ.7.50 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రేను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యులు జి.వేణుగోపాల్, జి.అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవనదుల చెంత..
నీటికి చింత



పాతపట్నం వద్ద ఇసుక మేటలతో దర్శనమిస్తున్న మహేంద్రతనయ నది

- అడుగంటిన చెరువులు
- పాడి పశువులకు తప్పని తాగునీటి కష్టాలు
- వేసవి పరిస్థితి ఏమిటా అని ఆందోళన
- పాతపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే పరిస్థితి..



ఎండిపోయిన అసర్లవాని చెరువు

ఎల్.ఎన్.పేట: వేసవి ప్రారంభంలోనే సాగునీటి చెరువులు అడుగంటిపోయాయి. పాతపట్నం నియోజకవర్గంలో నీటి కష్టాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వర్షాకాలంలో నిండుకుండల్లా కనిపించే నదులు, చెరువులు, సాగరాలు ఈ ఏడాది వేసవి ప్రారంభం నాటికే అడుగంటిపోవడంతో నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్ వేసవి కాలాన్ని ఊహించుకుని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలోని చెరువులు, సాగునీటి వనరుల వివరాలు ఇలా..

మండలం	రెవెన్యూ గ్రామాలు	మొత్తం చెరువులు	ఆయుకట్టు ఎకరాల్లో
ఎల్.ఎన్.పేట	47	157	10,850
హిరమండలం	40	114	6,500
పాతపట్నం	49	235	18,600
కొత్తూరు	34	250	20,800
మెళియాపుట్టి	70	185	19,500

ఎడారులను తలపిస్తున్న నదులు..

నియోజకవర్గంలో వంశధార, మహేంద్రతనయ నదులున్నాయి. ఈ రెండు జీవ నదులు ఫిబ్రవరిలోనే అడుగంటిపోయాయి. చుక్కనీరు లేక ఎడారులను తలపిస్తున్నాయి. గ్రామాల్లో ఉన్న చెరువులన్నీ పూర్తిగా ఎండిపోయాయి. మార్చి నాటికే పరిస్థితి ఇలా ఉంటే మే నెలలో ఇంకెంత దారుణంగా ఉంటుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది నవంబర్ నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో చెరువుల్లో నీరు అడుగంటి పోయింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు, మూగజీవాలకు కూడా తాగునీటికి గడ్డు పరిస్థితి ఏర్పడనుంది.

దశాబ్ద కాలం తరువాత..

నియోజకవర్గంలోని జీవనదులుగా పేరొందిన వంశధార, మహేంద్రతనయ చెంత తాగు, సాగునీటికి చింత ఏర్పడింది. 2015 తరువాత ఇంటాంటి పరిస్థితి ఏర్పటం ఇదే మొదటిసారి అని రైతులు, ప్రజలు చెబుతున్నారు. ప్రతీ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడిచిపెట్టేవారు. ఈ కాలువ ద్వారా వచ్చిన నీటితో చెరువులను నింపి వేసవి అవసరాలకు, పాడి పశువుల కోసం వినియోగించుకునేవారు. పిల్ల కాలువల ద్వారా వేసవి పంటలు పండించుకునేవారు. ఈ ఏడాది వేసవి ప్రారంభానికి ముందే సాగునీటి వనరులు అడుగంటి పోయాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వాడవలస వద్ద పిల్ల కాలువను తలపించేలా వంశధార నది

వేసవి పరిస్థితి భయంగా ఉంది



గత కొన్ని నెలలుగా వర్షాల్లేకపోవడంతో నదులు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. ఈ ఏడాది వేసవి పరిస్థితి ఏమిటా అని భయంగా ఉంది. ఇప్పటికే తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. వంశధార నదిలో ఈ ఏడాది నీరు పూర్తిగా తగ్గిపోయింది. ఊరు చుట్టూ ఉన్న చెరువులు కూడా ఎండిపోయాయి. ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

ఉపాధి వేతనదారుల ఆందోళన



ఉపాధి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వేతనదారులు

హిరమండలం: మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయం ఎదుట హిరమండలానికి చెందిన ఉపాధి వేతనదారులు గురువారం ఆందోళన చేపట్టారు. అందరికీ సమానంగా వేతనాలు అందించాలని 180 మంది వేతనదారులు కోరారు. గత రెండు నెలల నుంచి వేతనం తక్కువగా వస్తుందన్నారు.


వేలం పాట రేపు

బూర్జ: ఈ నెల 29వ తేదీన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో టేకు కలపను వేలం వేయనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ వై.వి.పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. ఎ.టి.ఒడ్డుపర్త గ్రామ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న 13 టేకు చెట్లను 66 ముక్కలుగా గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారన్నారు. వాల్టా చట్టం ప్రకారం వీటి విలువను నిర్ణయించి వేలం వేస్తామన్నారు. వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ అకౌంట్‌కి జమ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పైపులైన్ బాగుచేశారు..

సాక్షి ఎఫెక్ట్

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు అందించే పైపులైన్‌ను గురువారం బాగుచేశారు. లక్ష్మీనర్సుపేటలోని మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ రావిచంద్రి వద్ద పాడైంది. ఈ నెల 26న 'తాగునీరు వృథా' అనే వార్త సాక్షిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎంపీడీఓ పైడి శ్రీనివాసరావు సూచనల మేరకు ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు లీకేజీ జరుగుతున్న స్థలానికి చేరుకున్నారు. మెకానిక్‌ను పిలిపించి మరమ్మతులు చేపట్టారు. రావిచంద్రి, ధనుకువాడ, చింతల బడవంజ, తురకపేట సెంటర్, శ్యామలాపురం తదితర గ్రామాలకు తాగునీరు అందేలా శాశ్వత పనులు చేపట్టామని ఈఓపీఆర్డీ తెలిపారు.



మరమ్మతులు చేపట్టిన దృశ్యం

అవస్థలు



ఆమదాలవలస పట్టణంలోని రైల్వే క్వార్టర్స్, లక్ష్మీనగర్ వీధి వెనుక భాగం మురుగుతో నిండిపోయింది. దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల బారీన పడుతున్నామని ఆయా ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో మురుగు కాలువలు లేకపోవడంతోపాటు, పారిశుద్ధ్య సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే.. ఈ ప్రాంతం రైల్వే అధికారుల పరిధిలోకి వస్తుందని చెబుతున్నారని వాపోయారు. – ఆమదాలవలస

అభ్యర్థన



సారవకోట మండలంలోని అర్లి గ్రామంలో తాగునీటి బోరు గత కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది దీనిపై చర్యలు తీసుకునే దాఖలాలు లేవు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నీటి సరఫరా చేసేందుకు గ్రామంలో రోడ్లు తవ్వి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా చుక్క నీరు రావడం లేదు. బోరు బాగుచేయాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు. – సారవకోట

అవగాహన



రసాయన పద్ధతులకు దూరంగా ఉంటూ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేయాలని కొత్తూరు అగ్రికల్చర్ డివిజన్ ఏడీ బొడ్డేపల్లి రాజగోపాలరావు అన్నారు. సరుబుజ్జిలి మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా, వెలుగు సిబ్బందికి అవగాహన కల్పించారు. సేంద్రియ విధానంలో సాగు చేయడం వలన బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. వెలుగు ఏపీఎం గోవిందరాజులు, ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి, డివిజన్ ఎంటీ సూర్యనారాయణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. – సరుబుజ్జిలి

అభినందన



విద్యార్థులు ప్రతిభా పరీక్షల్లో రాణించాలని పాతపట్నం ఎంపీడీఓ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని తీమర, జగ్గిలిబొంతు ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎందవ ఆదర్శప్రేమ, గంటా జీవన్‌బాబు జవహర్ నవోదయకు ఎంపికయ్యారు. వీరిని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ, ఎంఈఓలు, ఉపాధ్యాయులు గురువారం సత్కరించారు. విద్యార్థులకు ట్రస్ట్ తరఫున జ్ఞాపికలు, అబ్దుల్ కలాం జీవిత చరిత్ర పుస్తకాలు, ఇద్దరికి కలిపి రూ.వెయ్యి నగదు అందజేశారు. – పాతపట్నం

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

బూర్జ: మండలంలోని పెద్దపేట రైతు సేవా కేంద్రంలో పెసర, మినుముల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రమణి గురువారం ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ పెసలు క్వింటా రూ.8,682, మినుములు క్వింటా రూ.7,400 కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సరుబుజ్జిలి, బూర్జ మండలాల రైతుల కోసం గిడ్డంగులు కూడా నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాలరావు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, పెద్దపేట ఆర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఎల్.ఎన్.పేట: రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించి పెట్టుబడి భారం పెంచుకుంటున్న రైతుకు సాగు లాభదాయకంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం మేలు అని అడిషనల్ డీపీఎం ఎస్.ధనుంజయరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంఎంఎస్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విభాగం, వ్యవసాయశాఖ, మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో గురువారం 2026 వ్యవసాయ ప్రణాళికా సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే ఖరీఫ్‌లో శత శాతం ప్రకృతి వ్యవసాయం సాగు జరిగేలా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. భూమిని సారవంతంగా మార్చేందుకు, పంట పొలాల్లో లోపించిన పోషకాలను పెంచేందుకు వేసవి నుంచే రైతులు చేపట్టాల్సిన పద్ధతులపై రైతులతో కలిసి సభలు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. చెరువుల్లోని మట్టిని పొలాల్లో వేయడం, గొర్రెలు, మేకల మందలు వేయడం, కుళ్లిన గత్తం వేయడం, పచ్చి రొట్ట సాగుతో భూసారం పెరుగుతుందన్నారు. ఐకేపీ ఏపీఎం ఎస్.రవిరాజ్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు మణి, ఎంటీ రమణ, యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత, ఐసీఆర్పీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీసీ రుణాలకు ఇంటర్వ్యూ

హిరమండలం: బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయనున్న రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కాళీప్రసాదరావు గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తిస్థాయి ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

నేడు సమన్వయ సమావేశం

జలుమూరు: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, బ్యాంకర్లతో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.అప్పలనాయుడు గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు హాజరుకావాలన్నారు.

29న బీసీ రుణాలకు ఇంటర్వ్యూ

ఎల్.ఎన్.పేట: ఈ నెల 29వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ పైడి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు దరఖాస్తుతోపాటు జతపరిచిన ఒరిజనల్ పత్రాలతో హాజరుకావాలన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: ఈ నెల 29న ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి రుణాల మంజూరుకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.చంద్రకుమారి గురువారం తెలిపారు. ఉదయం పది గంటలకు దరఖాస్తుదారులు చేరుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

పరామర్శ..



కడుము కాలనీలో నారాయణమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

కొత్తూరు: మండలంలోని పలు కుటుంబాలను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పరామర్శించారు. కురిగాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సేపాన సాయిరాజ్, కడుము కాలనీకి చెందిన బూరాడ నారాయణమ్మ, కడుము గ్రామానికి చెందిన బూరాడ చిన్నమ్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా కుటుంబాలను రెడ్డి శాంతి పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ అగతమూడి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ అశోక్, జగన్, సంజీవరావు, అప్పలస్వామి, తదితరులు ఉన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

పొందూరు: స్థానిక సాయిబుల కాలనీ, కుమ్మర్ల కాలనీ, తాపీమేస్త్రీ కాలనీలకు పంచాయతీ ఈఓ కింతలి మోహన్‌బాబు గురువారం ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. ఈ కాలనీలకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. ప్రస్తుతం పైప్‌లైన్ పనులు చేస్తున్నామన్నారు. పైప్‌లైన్‌ను బాగుచేసే వరకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

నేడు మండల సమావేశం

బూర్జ: ఈ నెల 28న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. 2024–2025 సవరణ బడ్జెట్, 2025–26 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెడతామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

వై.ఎస్.జగన్‌ను కలిసిన గుమ్మడి



బూర్జ మండలంలోని తోటవాడ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు.. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గంలోని పరిస్థితులను రాంబాబుకు జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. – బూర్జ

ఈకేవైసీ పేరుతో రేషన్ కట్!

- ఆందోళనలో రేషన్ డీలర్లు

జలుమూరు: ఈకేవైసీ పేరుతో ఏప్రిల్‌లో పంపిణీ చేయనున్న బియ్యం అలాట్‌మెంట్ తగ్గించారని పలవురు డీలర్లు వాపోతున్నారు. ఇప్పటికే ఆయా డిపోలకు మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి బియ్యం పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 18 వేలకు పైగా రేషన్‌కార్డులున్నాయి. ఇందులో నాలుగు వేల మందికి పైగా లబ్ధిదారులకు సంబంధించి ఈకేవైసీ జరగలేదు. గడిచిన మూడు నెలలు ఆయా డిపోల ద్వారా బియ్యం పంపిణీ జరిగిన శాతాన్ని పరిగణలోకి తీసుకొని ఏప్రిల్‌లో పంపిణీ కానున్న బియ్యంపై కోత విధించడం ఏమిటని రేషన్ డీలర్లు ప్రశ్నిస్తున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులు ఇచ్చిన నివేదికలో ఉన్న పేర్లలో గత ఐదు రోజులుగా ఈకేవైసీ చేసుకున్న లబ్ధిదారులకు బియ్యం ఎలా పంపిణీ చేయగలమని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బియ్యం పంపిణీలో కోతలేకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై సీఎస్‌డీటీ షరీఫ్ వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యాన్ని ఆయా డిపోలకు అలాట్‌మెంట్ చేయడం జరిగిందన్నారు.

కళలను ప్రోత్సహించాలి



బంకుపల్లి దుర్గాప్రసాద్‌శర్మను సన్మానిస్తున్న కళాకారుల సంఘం కార్యవర్గ సభ్యులు

ఆమదాలవలస: ప్రాచీన కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సీనియర్ కళాకారులు, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జె.జె.మోహన్‌రావు అన్నారు. ప్రపంచ కళాకారుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పాలపోలమ్మతల్లి ఆలయ ఆవరణలో కళాకారుల సంఘ అధ్యక్షుడు టేకి త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య అతిథి తమ్మినేని విద్యాసాగర్ మాట్లాడుతూ.. కళలు అంతరించిపోతున్న తరుణంలో ప్రభుత్వాలు వాటి మనుగడకు కృషి చేయాలని కోరారు. కళాకారుల సంక్షేమ సంఘం సహాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు మాట్లాడుతూ కళారంగాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. అనంతరం సత్యహరిశ్చంద్ర పద్యాలను కళాకారులు ప్రదర్శించారు. ప్రముఖ మృదంగ కళాకారుడు బంకుపల్లి దుర్గాప్రసాద్ శర్మను కళాకారుల సంక్షేమ సంఘం తరఫున సన్మానించారు. కళాకారుల సంఘ గౌరవాధ్యక్షుడు బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి బగాది వెంకటరావు, కళాకారుడు నూక రాజు, వైద్యుడు పి.తాతయ్యలు, సనపల అన్నాజీరావు, కళాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం

హిరమండలం: ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న ఉగాది వేడుకలకు స్థానిక పెద్దకోరాడ వీధిలోని నీలమణి దుర్గ ఆలయం ముస్తాబైంది. ఏటా ఉగాది సందర్భంగా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆలయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 48 ఏళ్ల కిందట ఇక్కడ గ్రామదేవత వెలసినట్టు గ్రామపెద్దలు చెబుతున్నారు. 12 ఏళ్ల కిందట ఆలయాన్ని పునర్ నిర్మించారు. అప్పటి నుంచి ఏటా ఉగాది రోజు జాతర, ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: ఈ నెల 28వ తేదీన 11 కేవీ లైన్‌లోని మడపాం ఫీడర్ పరిధిలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నరసన్నపేటలోని కృష్ణనగర్, జమ్ము, తామరాపల్లి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

వేలం పాట వాయిదా

కొత్తూరు: మండలంలోని బలదలో ప్రతీ మంగళవారం సంత నిర్వహించనున్నారు. ఆశీలు వసూలు కోసం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వేలం పాట నిర్వహించినట్లు ఎంపీడీఓ నీరజ తెలిపారు. గతేడాది రూ.81,000లకు వేలం పాడగా.. ఈ ఏడాదికి సంబంధించి రూ.65 వేలకు వేలం పాడారు. గతేడాది కంటే తక్కువ మొత్తానికి వేలం పాడటంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. వేలం పాటలో నలుగురు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

మెళియాపుట్టి: ఈ నెల 26వ తేదీన 'యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించారు. ఆంధ్రా ఇసుకను రాత్రి వేళల్లో ఒడిశాకు తరలించకుండా గురువారం పలుచోట్ల నిఘా పెట్టారు. ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్లను నిలిపి వారి వద్దనున్న పత్రాలను పరిశీలించారు.